# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 306 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 18 జూలై 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 306 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 18 JULY 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో గృహప్రవేశం చేసిన సీఎం చంద్రబాబు

మొన్న ఢిల్లీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు

చంద్రబాబుకు ఢిల్లీలో 1 జన్ పథ్ నివాసం కేటాయింపు

నిన్న పూజా కార్యక్రమాలు నిర్వహించిన చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో గృహప్రవేశం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు దేశ రాజధానిలోని '1 జన్ పథ్' నివాసాన్ని కేటాయించారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు, ఇవాళ తన అధికారిక నివాసంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, లోక్ సభలో టీడీపీ పక్ష నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్), సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో కొత్తగా ఈ మూడు చోట్లా విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం



పెన్ పవర్ డెస్క్:ఏపీలో మూడు కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర చీఫ్, రాజ మండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. దగదర్తి (నెల్లూరు జిల్లా), కుప్పం (చిత్తూరు జిల్లా), మూలపేట (శ్రీకాకుళం జిల్లా)లో

వివరాలు 2లో..

# అయినసూ పోయి రావలె హస్తినకు..

## బాబు ఢిల్లీ పర్యటనలపై షర్మిల సెటైర్లు

- మొన్న ఢిల్లీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు
- చంద్రబాబు ఢిల్లీ వెళుతున్నాడే కానీ ప్రయోజనం లేదన్న షర్మిల
- కేంద్రంతో ఒక్క ప్రకటన కూడా చేయించలేకపోతున్నాడని విమర్శలు



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం(జులై 16) ఢిల్లీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. నిన్న సాయంత్రం ఢిల్లీకి వెళ్లిన ఆయన రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో గంటపాటు భేటీ అయ్యారు. అనంతరం ఇవాళ ఉదయం సీఎం అధికారిక నివాసం(1, జన్‌పథ్)లో పూజా కార్యక్రమాలు నిర్వహించాక విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ పర్యటనలపై ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిప్పులు చెరిగారు. కేంద్రంలో చక్రం తిప్పాల్సిన బాబు.. ఆదిమ మరిచారని షర్మిల విమర్శించారు. బీజేపీ పెద్దలకు సలాం కొట్టడానికే బాబు పదే పదే హస్తినకు వెళ్తున్నారని ఆరోపించారు. అది నిజం కాదు, అనడానికి టీడీపీ వద్ద ఉన్న ఆధారాలేంటో చూపించాలని ఆమె ప్రశ్నించారు. "కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి నెల రోజులు దాటినా.. మోడీతో గానీ ,ఇతర మంత్రులతో గానీ ఒక్క హామీ మీద ఎందుకు ప్రకటన చేయించలేకపోయారు? గెలిచిన రోజు నుంచి నాలుగు సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా రాష్ట్ర ప్రయోజనాలపై ఒక్క ప్రకటన అయినా వచ్చిందా ?.." అని షర్మిల టీడీపీ అధినేతను సూటిగా ప్రశ్నించారు.

**విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ..!**

గతంలో అధికారంలో లేని సమయంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకం అన్న టీడీపీ-జనసేన నేతలు ఇప్పుడు ఏం చేస్తున్నారని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ప్రశ్నించారు. "విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉండదు అని కేంద్ర పెద్దలతో చెప్పించ గలిగారా ? పోలవరం ప్రాజెక్ట్ కి నిధులపై స్పష్టత ఇచ్చారా ? రాజధాని నిర్మాణం పై కేంద్రం ఇచ్చే సహాయం ఏంటో చెప్పగలిగారా ?.." అని పలు సవాళ్లు విసిరారు.

**బాబుగారు కళ్లు తెరవండి..!**

అదే సమయంలో సంధర్భాన్ని బట్టి మనుషులను, ప్రజలను వాడుకోవడంలో బీజేపీ నైజం ఎలాంటిదో చెప్పేలా సెటైర్లు విసిరారు. "ఒడ్డు దాటేదాకా ఓడ మల్లన్న.. దాటాక బోడి మల్లన్న.." ఇదే బీజేపీ సిద్ధాంతం. బాబు గారు ఇప్పటికైనా కళ్లు తెరవడం మంచిది. మరోసారి రాష్ట్ర ప్రజల మనోభావాలతో బీజేపీ ఆటలు అడుకుంటుంది అని గుర్తిస్తే మంచిది.." టీడీపీ అధినేతను షర్మిల హెచ్చరించారు.

## కూర్చోబెట్టినా.. ప్లీజ్ వెళ్లిపో..

జేసీ ప్రభాకర్ రెడ్డి పంపించేసిన ఇతనెవరంటే..




పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ శత్రు త్వాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాజకీయ శత్రుత్వాలే వ్యక్తిగత కక్షలుగా మారి విరోధులుగా మిగిలిపోయిన రాజకీయ నేతలు ఏపీలో చాలామందే ఉన్నారు. రాయలసీమలోని అనంతపురం జిల్లాలో ఈ పొలిటికల్ పంతాలు, పట్టింపులు మరీ ఎక్కువ. అప్పట్లో పరిటాల కుటుంబానికి, జేసీ కుటుంబానికి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఈ రెండు

వివరాలు 2లో..

## ఫేక్ ప్రచారాల్లో మీరు దిట్ట

కేటీఆర్ పై టీ కాంగ్రెస్ ట్వీట్



పెన్ పవర్ డెస్క్: ఫేక్ ప్రచారాలు చేయడంలో కేటీఆర్ దిట్ట అని, గోబెల్స్ ను మించి పోయారని టీకాంగ్రెస్ ట్విట్టర్ వేదికగా స్పందించింది. సుప్రీంకోర్టు తీర్పుపై కేటీఆర్ 'సత్యమేవజయతే' అంటూ స్పందించిన విషయం తెలిసిందే. దీనికి టీ కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. ' కేటీఆర్ గారూ..ఫేక్ ప్రచారాలు చేయడంలో మీరు గొబెల్ ను మించి పోయారు.ఆ విషయంలో మీరు "ఒక వర్గానికి" ఇన్స్పిరేషన్!సుప్రీం తీర్పులో అసలు విషయాన్ని ఉద్దేశపూర్వకంగా దాచేశారు. మీరు "దోచేసిన" దానిపై విచారణ ఖాయం అన్న విషయాన్ని వదిలేసి."అర బుర్ర" అని, మిమ్మల్ని ట్రోల్ చేసే వారి, అభిప్రాయాన్ని నిజం

వివరాలు 2లో..

## మహారాష్ట్రలో భారీ ఎన్ కౌంటర్... 12 మంది మావోయిస్టుల హతం

- మహారాష్ట్ర-చత్తీస్ గఢ్ సరిహద్దుల్లో కాల్పుల మోత
- వందోలి గ్రామం వద్ద నక్సల్స్ ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాల కూంబింగ్
- ఆరు గంటలకు పైగా ఇరు పక్షాల మధ్య భీకర కాల్పులు
- మృతుల్లో ఇద్దరు తెలుగు వాళ్లు!



వివరాలు 2లో..

## మంచి, మర్యాద గురించి ఎవరికైనా అవసరమైతే నేను నేర్పిస్తా

కొన్నిరోజులుగా విజయసాయిరెడ్డిపై మీడియాలో కథనాలు

భగ్గుమంటున్న విజయసాయిరెడ్డి

కొన్ని మీడియా సంస్థలపైనా, మంత్రి లోకేశ్ పైనా ఆగ్రహం



పెన్ పవర్ డెస్క్:మీడియాలో, సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారం పట్ల వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి భగ్గుమంటున్నారు. ముఖ్యంగా, కొన్ని మీడియా సంస్థలపైనా, మంత్రి నారా లోకేశ్ పైనా ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తాజాగా లోకేశ్ ను ఉద్దేశించి విజయసాయి ట్వీట్ చేశారు.

వివరాలు 2లో..

## నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి రూట్ మ్యాప్

### జలసౌధలో మంత్రి ఉత్తమ్ సమీక్ష



పెన్ పవర్ డెస్క్: రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాల వేగవంతానికి నీటి పారుదల శాఖ రూట్ మ్యాప్

వివరాలు 2లో..

## దయచేసి మమ్మల్ని సంప్రదించండి...

### నాస్కామ్ సభ్యులకు ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం

ప్రైవేటు సంస్థల్లో స్థానికులకు రిజర్వేషన్

బిల్లుకు కర్ణాటక క్యాబినెట్ ఆమోదం తెలపడంపై నాస్కామ్ అసంతృప్తి

ఏపీకి వచ్చేయండి... అత్యుత్తమ సదుపాయాలు కల్పిస్తామన్న ఐటీ శాఖ మంత్రి లోకేశ్



పెన్ పవర్ డెస్క్:ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు స్థానికులకు రిజర్వేషన్ కల్పించాలన్న బిల్లుకు కర్ణాటక మంత్రివర్గం ఆమోదం తెలపడంపై నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్ వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి రిజర్వేషన్ల వల్ల కంపెనీల్లో నిపుణులైన ఉద్యోగుల

వివరాలు 2లో..

## ఈడీ కేసులో ఎక్కడ బయటకు వస్తానో అనే... సీబీఐ అరెస్ట్ చేసింది

కేజ్రీవాల్ తరఫున వాదనలు వినిపించన అభిషేక్ మనుసింఘ్వీ

కేజ్రీవాల్‌కు అనుకూలంగా మూడుసార్లు కోర్టు తీర్పు వచ్చిందన్న న్యాయవాది

బెయిల్ వచ్చినా స్టే విధించేలా చేశారని కోర్టుకు తెలిపిన మనుసింఘ్వీ

జైల్లో కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తోందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడానికి సీబీఐ వద్ద కారణాలు లేవని... కానీ ఈడీ కేసులో ఎక్కడ బయటకు వస్తారో అనే ఆలోచనతో అరెస్ట్ చేసినట్లుగా తెలుస్తోందని ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ వాదనలు వినిపించారు. తన అరెస్ట్‌ను సవాల్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై కోర్టులో ఈరోజు వాదనలు జరిగాయి. కేజ్రీవాల్ తరపున అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. వాదనల సందర్భంగా దర్యాప్తు సంస్థపై కేజ్రీవాల్ న్యాయవాది

వివరాలు 2లో..

# సంపాదకీయం

## గురువును పూజించే రోజు.. గురుపౌర్ణమి

పండగలకు.. ఉత్సవాలకు దేవాలయాలకు వెళతాం.. దేవుళ్లను పూజిస్తాం. వినాయకచవితికి వినాయకుడిని.. దసరా కు దుర్గాదేవిని.. శివరాత్రికి శివుడిని ఇలా ఎవరి ఇష్టం వచ్చిన దేవుడిని వారు పూజిస్తారు. అయితే మనం ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నా...జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నా... జీవితంలో ఎవరితో ఎలా ఉండాలి.. అనే విషయాలు గురువు నేర్పుతారు. ప్రతి వ్యక్తి జీవితంలో గురువు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. అలాంటి గురువును వాస్తవంగా రోజూ పూజించాలి. అయితే ప్రతి మనిషికి ఒక్కో సమయంలో ఒక్కో గురువు ఉంటారు. చిన్నప్పుడు స్కూల్లో కొంతమంది .. హైస్కూలో కొంతమంది.. కాలేజీల్లో.. జీవిత పాఠాలే నేర్పే గురువులు ఉంటారు. అయితే ఇలాంటి వారందరని గురుపౌర్ణమి( జులై 21)న పూజించాలని పురాణాలు చెబుతున్నాయి. ప్రతి ఒక్కరూ గురువుని దేవులాడుకుంట పోనక్కర్లేదు. నిజాయితీగా ఒక లక్ష్యం కోసం తపిస్తున్నప్పుడు గురువే మీ జీవితంలోకి పస్తాడు. ఆ గురువే మిమ్మల్ని గమ్యం వైపు నడిపిస్తాడు. చిన్నప్పటి నుంచి మనం ఎంతో మంది గురువుల దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకుంటం. కానీ, అందరూ జీవితంపై ముద్ర వెయ్యలేరు. మన జీవితాన్ని తీర్చిదిద్దే గురువు ఎలా ఉంటారో .. పురాణాల్లో వివరించారు.

సత్యాన్ని పాటిస్తాడు.

**సమస్త జీవరాశుల పట్ల దయతో ఉంటాడు**

**ప్రశాంతమైన మనసు కలిగినవాడు.**

**నిగ్రహ, అనుగ్రహ శక్తులు ఉన్నవాడు.**

**పరమభక్తుడు, వేద, జ్ఞాన సంపన్నుడు,**

**యోగం తెలిసినవాడు.**

**శిష్యుడి తప్పుని గుర్తించగలిగినవాడు.**

### రకరకాల గురువులు..

మామూలుగా గురువు అనగానే చదువు చెప్పేవాడని అనుకుంటారు. కానీ, మనకు అనేక రకాల గురువులు ఉన్నారని హిందూ మత గ్రంథాలు చెప్తున్నాయి. ఏ గురువుడైనా తన శిష్యుడికి జ్ఞానం ప్రసాదించాలనే లక్ష్యమే ఉంటుంది.

**సూచక గురువులు:** భక్తి, జ్ఞాన, వైరాగ్య బోధనలు చేసి సాధన సంపత్తి కలిగిన శిష్యులను తయారు చేస్తారు. చదువు చెప్పేవాళ్లు కూడా వీళ్లే.

**వాచక గురువులు:** ఆశ్రమ ధర్మాలను బోధిస్తూ... దేహం అశాశ్వతమని గమ్యాన్ని గుర్తు చేస్తారు.

**వేదగురువులు:** వేద పురాణేతిహాసాలు చదివి, శిష్యులతో చదివిస్తరు. ధర్మాలను విశదీకరించి ఆచరిస్తూ ఆచరింపజేస్తారు.

**నిషిద్ధ గురువులు:** మంత్ర తంత్రాలతో... వశీకరణ విద్యలు బోధిస్తారు.

**బోధక గురువు :** మంత్రాలు ఉపదేశిస్తారు.

**విహిత గురువులు:** భోగాల మీద విరక్తి కలిగిస్తారు.

**కారణ గురువులు:** ఆసనాలు, ప్రాణాయామాలు చేయించి.. బ్రహ్మతత్వాన్ని ఉపదేశించి.. అద్వైత స్థితిని కలిగిస్తారు.

**పరమ గురువు:** పరమాత్మ అనుభవాన్ని ప్రత్యక్షంగా కలిగిస్తారు.

**సద్గురువులు:** తెలుసుకోగలిగితే.. గురువు, ఆయనే గొప్ప గురువు

వశిష్టుడు, వాల్మీకి లాంటి తపశ్శక్తి సంపన్ను లు ఎంతమంది ఉన్నా వేదవ్యాసుడికే మన ప్రాచీనులు అగ్రపీఠం వేశారు. ఎందుకంటే, ఒకే రాశిగా ఉన్న వేదాల్ని ఋగ్, యజు. సామ, అధర్వణ వేదాలుగా విభజించి లోకానికి అందించినవాడు వ్యాసుడు. ఆయనే బ్రహ్మసూత్రాలకు భాష్యం రాశాడు. మహాభారతం, భాగవతాలను రచించాడు. శ్రీకృష్ణుడి రూపంలో ప్రపంచానికి భగవద్గీత బోధించాడు. అనంతమైన సాహిత్యాన్ని సృష్టించి, దాని ద్వారా భారతీయ సంస్కృ తికి పునాదిరాళ్లు వేశాడు. శక్తి, భక్తి, శీలం, సహజీవనం, సనాతన ధర్మం, పవిత్రత, దానధర్మాలు ఈ దేశ సహజ లక్షణాలుగా రూపొందటానికి మూలం వ్యాసుడి రచనలే. ఇంతటి మహారుషిని భారతజాతికి గురువుగా భావించి చేసే పూజే 'గురుపౌర్ణమి'. భగవద్గీతలో కృష్ణుడు ..ఇలా చెప్పాడని పండితులు చెబుతున్నారు

**'మునీనామ్యహం వ్యాసః'..** 'మునుల్లో నేను వ్యాసుడిని"అంటాడు. ఇక్కడ గురువుదేవునితో సమానమని చెప్పకనే చెప్పాడు

నిజమైన గురువు తన శిష్యుల భ్రమల్ని పటాపంచలు చేస్తాడు. అతని సమక్షంలో ఉన్నప్పుడు శిష్యుడు కంఫర్టని, సంతోషాన్ని ఫీలవుతాడు. నిజాలు చెప్తూ తమకు తామే రియలైజ్ అయ్యేట్టు చేస్తాడు. గురువు ఆలోచనలు, ఆచరణ ఒకేవిధంగా ఉంటాయి. నిజమైన గురు, శిష్యుల మనసులు కలిసి ఉంటాయి. జీవితంలో మీరు కోరుకున్నది. ఎవరూ 'ఇదిగో తీసుకో' అని తెచ్చివ్వరు. కాబట్టి దాన్ని మీరే తెచ్చుకోవాలె, దాన్ని ఎట్లా తెచ్చుకోవాలో చెప్పి మేలుకొలుపేది గురువే. సమర్థ రామదాస్ వీరశివాజీని తయారు చేశాడు. తన ఉపన్యాసాలతో భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన వివేకానందుడిని రామకృష్ణ పరమహంస తీర్చిదిద్దాడు. బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, భగవాన్ రమణమహర్షి వంటి ఎందరో మహా మహా గురువుల బోధనలు మనదేశాన్ని ధర్మమార్గంలో నడిపిస్తున్నాయి.

# మంచి, మర్యాద గురించి ఎవరికైనా అవసరమైతే నేను నేర్పిస్తా

- మొదటి పేజీ తరువాయి

"నారా లోకేశ్... నేను మీడియా ప్రతినిధులను ఎప్పుడూ తిట్టలేదు. మీడియా ముసుగులో మీరు పెంచి పోషిస్తున్న కుల అరాచక శక్తుల గురించి మాత్రమే మాట్లాడాను. నా మాటలను తప్పుదారి పట్టించవద్దు. అర్థం కాకపోతే నా ప్రెస్ మీట్ మళ్లీ వినండి. మంచి, మర్యాద గురించి ఎవరికైనా అవసరమైతే నేను నేర్పిస్తాను. మీ భాష ఏమిటో మీకు తెలియాలంటే గత 20 నెలల మీ వీడియోలను మీరే చూసుకోండి. పెద్దల సభ సభ్యుడితో మాట్లాడే తీరు ఇదేనా?" అంటూ ధ్వజమెత్తారు.

"నారా లోకేశ్... రాష్ట్రంలో విద్యారంగం దారి తప్పింది. పాలకులు మాట తప్పుతున్నారు. స్కాలర్షిప్ లు రాలేదు, హాస్టళ్లు లేవు. అక్రమ బదిలీలు జరుగుతున్నాయి. విద్యారంగంపై తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు. ముందు దానిపై దృష్టి పెట్టండి. ఈ మధ్య 40 రోజులుగా జరుగుతున్న నేరాలు, ఘోరాలకు కూటమి ప్రభుత్వంలోని పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారు? వీటిపై కూడా ఒక శ్వేతపత్రం విడుదల చేయొచ్చు కదా! అధికారం ఇస్తే 24 గంటల్లో న్యాయం అన్నారు... సుగాలి ప్రీతి ఏమైంది? చిత్తూరు జిల్లా మైనర్ బాలిక హత్య కేసు ఏమైంది? మీరు రాష్ట్రంలో రావణకాష్టాన్ని నిరాటంకంగా కొనసాగిస్తూ... కుల వివక్షతో మా పార్టీ కార్యకర్తలను, వారి కుటుంబాలను గ్రామాల నుంచి వెళ్లగొట్టి హింసిస్తూ, దాన్నుంచి దృష్టి మళ్లించడానికి ఎందుకీ యాతన?" అంటూ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

**పార్లమెంటులో ప్రైవేటు మెంబర్ బిల్లు పెడతా!**

ఇటీవలి పరిణామాల నేపథ్యంలో పార్లమెంటులో ప్రైవేటు మెంబర్ బిల్లు పెడతానని విజయసాయిరెడ్డి తెలిపారు. ఏపీలో కుల మీడియా సంస్థల పెత్తనం కొనసాగుతోందని మండిపడ్డారు. కుట్రపూరితమైన అజెండాతో ఆ మీడియా సంస్థలు ఫేక్ న్యూస్ వ్యాప్తిచేస్తూ, బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతూ, అప్రదిష్ఠపాల్జేసే చర్యలకు పాల్పడుతున్నాయని... వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఇతర పాత్రికేయ సంఘాలను ఆదేశించేలా బిల్లు పెడతానని వివరించారు. అధికారంతో పాటు బాధ్యత కూడా రావాలని, కానీ మీడియాలోని ఒక వర్గంలో ఆ రెండోది లోపించిందని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.

# కూర్చోబెట్టినా.. ప్లీజ్ వెళ్లిపో..

- మొదటి పేజీ తరువాయి

కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నాయి.

గ్రూప్ రాజకీయాలు ఎక్కువగా నడిచే ఈ జిల్లాలో జేసీ కుటుంబానికి రాజకీయంగా మంచి పలుకుబడి ఉంది. అనుచర గణం ఉంది. ఆ అనుచర గణంలో కొనసాగిన వ్యక్తుల్లో ఒకరు లాయర్ శ్రీనివాసులు. గత ఎన్నికల ముందు జేసీ సోదరులను వీడిన ఈ లాయర్ వైసీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జేసీ సోదరులపై, టీడీపీపై శ్రీనివాసులు తీవ్ర విమర్శలు చేశారు. దీంతో.. జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ లాయర్?పై గుర్రుగా ఉన్నారు. అధికారం చేతులు మారింది. టీడీపీకి అధికారం దక్కింది. జేసీ ప్రభాకర్ రెడ్డిని మచ్చిక చేసుకోక తప్పని పరిస్థితి ఈ న్యాయవాదికి ఏర్పడింది. జేసీ ప్రభాకర్ రెడ్డిని వెతుక్కుంటూ వెళ్లారు.. లాయర్ శ్రీనివాసులు. తన విమర్శలను రాజకీయంగానే చూడాలని, తనను మళ్లీ అనుచరుడిగా చేర్చుకోవాలని కోరారు. అందుకు జేసీ అంగీకరించకపోవడంతో ఆయన అనుచరులు శ్రీనివాసులుని బయటకు పంపించేశారు. 'వస్తే కూర్చోబెట్టినా.. ప్లీజ్ వెళ్లిపో' అని జేసీ ప్రభాకర్ రెడ్డి శ్రీనివాసులుతో చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పారు. జేసీ ప్రభాకర్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు అప్పటికీ సదరు న్యాయవాది ప్రయత్నించడంతో జేసీ అనుచరులు ఎత్తుకుని బయటకు తీసుకెళ్లారు.

ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం ఏపీలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఏపీలో అధికారం చేతులు మారిన ప్రతిసారి ఇలాంటి పరిస్థితి కొందరికి తప్పడం లేదని ఈ వీడియోపై స్పందిస్తూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. నేతలకు ఈ తలనొప్పులు తక్కువని.. అనుచరులకే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందనేది ఈ వీడియోపై స్పందిస్తున్న కొందరి నెటిజన్ల అభిప్రాయం.

## ఈడీ కేసులో ఎక్కడ బయటకు వస్తానో అనే...

# సీబీఐ అరెస్ట్ చేసింది

- మొదటి పేజీ తరువాయి

కీలకమైన ఆరోపణలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కేజ్రీవాల్‌ను జైల్లోనే ఉంచాలనే ఉద్దేశంతో సీబీఐ ఆయనను అరెస్ట్ చేసిందన్నారు. మద్యం పాలసీకి సంబంధించి ఈడీ కేసులో మూడుసార్లు కోర్టు కేజ్రీవాల్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఒకసారి సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ లభించిందన్నారు. ట్రయల్ కోర్టు సాధారణ బెయిల్ ఇచ్చిందని, కానీ దానిపై స్టే విధించేలా చేశారని వాదనల సందర్భంగా పేర్కొన్నారు.

ఆ తర్వాత సుప్రీంకోర్టులోను బెయిల్ లభించిందని, అయినా సీబీఐ కేసులో ఇంకా జైల్లోనే ఉన్నారని పేర్కొన్నారు. 2022 ఆగస్ట్‌లోనే మద్యం విధానంపై ఆరోపణలు వచ్చినప్పటికీ కేజ్రీవాల్‌ను విచారించడానికి... అరెస్ట్ చేయడానికి సీబీఐకి ఇప్పుడే ఆలోచన వచ్చిందన్నారు. దీనిని బట్టి ఈ కేసులో ఆయనను అదుపులోకి తీసుకోవాలని లేదా విచారించాలనే ఆలోచనకు సీబీఐ వద్ద కారణాలు లేవన్నారు. ఈడీ కేసు నుంచి కేజ్రీవాల్ ఎక్కడ బయటపడతారో అనే ఆలోచనతో ముందుజాగ్రత్తగా ఇలా ఇన్సూరెన్స్ అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. జైల్లో కేజ్రీవాల్ ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోందని అభిషేక్ అన్నారు.

# దయచేసి మమ్మల్ని సంప్రదించండి...

- మొదటి పేజీ తరువాయి

కొరత ఏర్పడతుందని ఆందోళన వ్యక్తం చేసింది. స్థానికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ వల్ల ప్రతిభావంతులైన ఉద్యోగులు లేక పనితీరు కుంటుపడుతుందని, తద్వారా సాఫ్ట్ వేర్ కంపెనీలు తరలిపోయే ప్రమాదం ఉందని నాస్కామ్ స్పష్టం చేసింది. దీనిపై ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు.

"ప్రియమైన నాస్కామ్ సభ్యులకు... మీ అసంతృప్తిని మేం అర్థం చేసుకోగలం. మీ వ్యాపారాలు విస్తరించుకోవడానికి, లేక, ఇతర ప్రాంతాల నుంచి వైజాగ్ లోని మా ఐటీ సేవలు, ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్ కు మీ వ్యాపారాలను తరలించుకోవడానికి మీకు స్వాగతం పలుకుతున్నాం. ఐటీ రంగంలోనే అత్యుత్తమ స్థాయి సౌకర్యాలను మీకు కల్పిస్తామని ఈ సందర్భంగా మాటిస్తున్నాను. ఎలాంటి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం తరఫున ఎలాంటి ఆంక్షలు లేని రీతిలో అత్యంత అనుకూలవంతమైన నిపుణులను మీకు అందిస్తాం. మీ ఐటీ వ్యాపారాలకు స్వాగతం పలికేందుకు ఏపీ సిద్ధంగా ఉంది. దయచేసి మమ్మల్ని సంప్రదించండి" అంటూ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

## మహారాష్ట్రలో భారీ ఎన్ కౌంటర్...

# 12 మంది మావోయిస్టుల హతం

**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్రలోని గడ్చిరోలిలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మహారాష్ట్ర–చత్తీస్ గఢ్ సరిహద్దుల్లోని వందోలి అటవీప్రాంతంలో ఈ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎదురుకాల్పుల ఘటనలో 12 మంది నక్సల్స్ మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ లో పాల్గొన్న పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ సతీశ్ పాటిల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలం నుంచి అనేక ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్ కౌంటర్ లో హతులైన మావోయిస్టుల్లో ఇద్దరు తెలుగు వాళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మధ్యాహ్నం 7 సీ60 కమాండో దళాలు వందోలి

గ్రామం వద్ద నక్సల్స్ సమావేశం అయ్యారన్న సమాచారంతో కూంబింగ్ కు బయల్దేరాయి. ఈ సందర్భంగా సీ60 కమాండో బలగాలకు, మావోయిస్టులకు మధ్య దాదాపు ఆరు గంటలకు పైగా భీకర కాల్పులు జరిగాయి. కాగా, మృతి చెందిన వారిలో సీనియర్ డివిజనల్ కమిటీ మెంబర్ కూడా ఉన్నట్టు గుర్తించారు.

# ఏపీలో కొత్తగా ఈ మూడు చోట్లా విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం

- మొదటి పేజీ తరువాయి

నూతన విమానాశ్రయాలు ఏర్పాటవుతాయని చెప్పారు. కేంద్రంలోనూ ఎన్డీయే, రాష్ట్రంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలో ఉండడం వల్ల ఇది సాధ్యమవుతోందని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఏపీలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం

అయ్యాయని పురందేశ్వరి పేర్కొన్నారు. అభివృద్ధి ద్వారా అనుసంధానత పెరగడమే కాదు, ఆర్థిక పురోగతి కూడా సాధ్యమవుతుందని వివరించారు.

## ఫేక్ ప్రచారాల్లో మీరు దిట్ట

- మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు! విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో అక్రమాలపై విచారణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది%ొ %ఆ విషయాన్ని దాచేస్తే ఎట్లా!! విచారణ ఆగదు. నిజం నిగ్గు తేలకుండా ఉండదు.' అని పేర్కొంది.

## నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి రూట్ మ్యాప్

- మొదటి పేజీ తరువాయి

తయారు చేశామని ఆ శాఖ మంత్రి యన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మహబూబ్నగర్ పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు 2025 డిసెంబర్ నాటికి ఆ జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన వెల్లడించారు. పాలమూరు, రంగారెడ్డితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ ల పురోగతితోపాటు నిర్మించాల్సిన ప్రాజెక్టులపై జూలై 17న జలసౌదలో నీటిపారుదల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల శాఖా కార్యదర్శి రాహుల్ బొజ్జతోపాటు పలువురు అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కృష్ణా బేసిన్ పరిధిలోని పాలమూరు–, రంగారెడ్డి ప్రాజెక్ట్ తో పాటు మహబూబ్నగర్ జిల్లాలోని కోయిల్ సాగర్, ఆర్ బి ఎల్ ఐ యస్, జే. ఎన్.ఎల్.ఐ .యస్,డిండి ఎల్ ఐ యస్,ఏ.యం.ఆర్ యస్ ఎల్ బి సి, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ఎల్ ఐ సి పాజెక్టులు.

గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, నిల్వాయి ప్రాజెక్ట్, పాలెం వాగు, మత్తడి వాగు, యస్.ఆర్ యస్.పి ఫేస్2, చనాకా కోరాట, లోయర్ పెన్ గంగా, దేవాదుల, మోదీ కుంటవాగు, యస్.వై.పి, జే సి ఆర్ డి ఎల్ ఐ యస్, సీతారామ ఎల్ ఐ యస్ లపై సమగ్రమైన సమీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్ట్ లతో పాటు గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, మోదీకుంట,లోయర్ పెన్ గంగా, చనాక కోరాట, శ్రీపాద ఎల్లంపల్లి, జే సి ఆర్ డి ఎల్ యస్ తదితరాలు పూర్తి చేసేందుకు రూ. 8వేల కోట్ల పై చిలుకు అవుతుందన్న అంచనాకు అధికారులు వచ్చారన్నారు. అయితే అదే సమయంలో 2025 డిసెంబర్ నెలాఖరికి పూర్తి చేయాలన్న నిర్దేశిత లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించుకున్న తాము నీటి పారుదల శాఖకు అదనంగా మరో 11 వేల కోట్ల బడ్జెట్ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆర్థిక శాఖాకు పంపాలని నిర్ణయించామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లో రూ. 28,000 కోట్లు నీటి పారుదల శాఖాకు కేటాయించగా అందులో గత ప్రభుత్వం ప్రాజెక్ట్ ల నిర్మాణాల పేరుతో చేసిన అప్పులకు కడుతున్న వడ్డీయే రూ. 18,000 కోట్లు అని మరో రెండు వేల కోట్లు జీత భత్యాలకే ఖర్చు అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

అందుకే అదనపు బడ్జెట్ ను సమీకరించుకుని సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఆరు లక్షల పై చిలుకు ఎకరాలు సేద్యంలోకి తేవాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అందులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలను ఏ,బి,సి కేటగిరీలుగా విభజించామన్నారు. ఇప్పటికే పూర్తి కావొచ్చిన వాటిని ఏ కేటగిరీలో, ఆ తరువాత బి, ఆ తరువాత సి లుగా విభజించడం జరిగిందన్నారు. ఏ కేటగిరీలో 240.66 కోట్లతో 47,882 ఎకరాల ఆయకట్టును సేద్యం లోకి తీసుకొస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే విదంగా ఆన్ గోయింగ్ ప్రాజెక్టులుగా నిర్మితమౌతున్న ప్రాజెక్టులకు సుమారు 7,500 కోట్ల పై చిలుకు అంచనా వ్యయంతో 5,84,770 ఎకరాల ఆయకట్టు భూమిని సేద్యం లోకి తీసుక రానున్నట్లు ఆయన చెప్పారు. అదే విదంగా నిర్మల్ జిల్లా సదర మాట్ ప్రాజెక్టు ను ఈ నేల చివరి నాటికి,ఖమ్మం జిల్లాలో రాజీవ్ కెనాల్(సీతారాం ప్రాజెక్ట్ )ను ఆగస్టు 15 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# మంత్రి నారా లోకేశ్ చొరవతో కువైట్ నుంచి ఏపీకి చేరుకున్న శివ

**ఉపాధి కోసం ఏపీ నుంచి కువైట్ వెళ్లిన శివ**

**పడరాని కష్టాలు పడుతున్నానంటూ వీడియో**

**ఆదుకోకపోతే చావే దిక్కు అంటూ కన్నీటితో వేడుకున్న వైనం**

**వెంటనే స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేశ్**

ఏపీ నుంచి కువైట్ వెళ్లి, అక్కడ అష్టకష్టాలు పడుతూ, తనను ఎవరైనా ఆదుకోకపోతే చావే దిక్కు అంటూ శివ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టిన వీడియో వైరల్ కావడం తెలిసిందే. దీనిపై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేశ్ శివను కువైట్ నుంచి ఏపీకి రప్పించేందుకు ఎంతో కృషి చేశారు. భారత ఎంబసీతో సమన్వయం చేసుకుంటూ, అతడిని ఏపీకి తీసుకువచ్చేంతవరకు స్వయంగా పర్యవేక్షించారు. మంత్రి లోకేశ్ చొరవతో శివ కువైట్ నుంచి ఏపీకి తిరిగి వచ్చాడు. ఎయిర్ పోర్టులో శివను చూసి అతడి కుటుంబ సభ్యులు తీవ్ర భావోద్వేగాలతో కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, శివ తన స్వస్థలం మదనపల్లె చేరుకున్న విషయం తెలుసుకున్న నారా లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు.

# భూ భ్రమణం మారుతోంది.. కొత్త అధ్యయనంలో సంచలనాలు

### భూగ్రహంపై తీవ్ర ప్రభావం చూపుతున్న వాతావరణ మార్పులు

### ధ్రువపు మంచు కరగడంతో భూమధ్య రేఖ వైపు ద్రవ్యరాశి పంపిణీ

### స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ జ్యూరిచ్ యూనివర్సిటీ నూతన పరిశోధనలో వెలుగులోకి ఆసక్తికర విషయాలు



మానవ ప్రేరేపిత వాతావరణ మార్పులు భూగ్రహాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అనేక మార్పులకు కారణమవుతున్నాయి. ఏకంగా భూ భ్రమణం మారుతోందని నూతన అధ్యయనం వెల్లడించింది. వాతావరణ మార్పు భూమి అక్షం మార్పునకు కూడా దారితీస్తోందని స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ జ్యూరిచ్ యూనివర్సిటీ నూతన పరిశోధన పేర్కొంది. ధ్రువపు మంచు కరుగుతోందని, ఈ నీరు భూమధ్యరేఖ వైపు ప్రవహిస్తోందని, పర్యవసానంగా భూగ్రహం ద్రవ్యరాశి పంపిణీ జరుగుతోందని, గ్రహం భ్రమణ వేగాన్ని తగ్గిస్తోందని అధ్యయనం పేర్కొంది. పగటి సమయం కాస్త ఎక్కువగా ఉండేందుకు ఈ పరిణామం దారితీస్తుందని వివరించింది. ఈ మేరకు 'నేచర్ జియోసైన్స్'లో అధ్యయనాన్ని ప్రచురించింది.

కాగా ఈ నూతన అధ్యయనానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ బెనెడిక్ట్ సోజా స్పందిస్తూ.. వ్యక్తులు తమ చేతిని చాచి తిప్పుతున్న సదృశ్యానికి ఉదాహరణగా వివరించారు. భూమి ద్రవ్యరాశి అక్షం నుంచి దూరంగా కదిలినప్పుడు భ్రమణ వేగం పెరుగుతుందని, ద్రవ్యరాశి రివర్స్‌లో పంపిణీ అయినప్పుడు భ్రమణం నెమ్మదిస్తుందని వివరించారు. సాధారణంగా చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి ప్రభావం భూమిపై వుంటుంది. అయితే మనుషులు కర్బన ఉద్గారాలను ఇదే స్థాయిలో నిరంతరాయంగా కొనసాగిస్తే వాతావరణ మార్పులు చంద్రుడి ప్రభావాన్ని కూడా అధిగమించి ప్రభావం చూపగలవని పరిశోధకులు గుర్తించారు. వాతావరణ మార్పులు తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశం ఉందని బెనెడిక్ట్ సోజా హెచ్చరించారు. వాతావరణ మార్పులు భూగ్రహంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయని అన్నారు.

## నేటి నుంచి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీకి ప్రస్తుతం 6.47 లక్షల మంది క్రియాశీలక సభ్యులు ఉన్నారు. తాజాగా, 9 లక్షల క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయడమే లక్ష్యంగా రేపటి నుంచి కొత్త సభ్యత్వాల నమోదు చేపట్టనున్నారు. జులై 18 నుంచి 28 వరకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరగనుంది. క్రియాశీలక సభ్యత్వం పొందే ప్రతి ఒక్కరికీ ప్రమాద, జీవిత బీమా కూడా అందించనున్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో... కొత్త సభ్యులను చేర్చుకోవడంతో పాటు, పాత సభ్యత్వాల రెన్యువల్ కూడా చేపట్టనున్నారు.

గతంలో సభ్యత్వాల నమోదుకు 15 మంది జనసేన పార్టీ వాలంటీర్లకు మాత్రమే లాగిన్ ఐడీ ఇచ్చేవాళ్లు. ఈసారి 50 మంది జనసేన పార్టీ వాలంటీర్లకు లాగిన్ ఐడీ ఇస్తున్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు లేఖ రాసిన నరసాపురం ఎంపీడీవో

**అదృశ్యమైన నరసాపురం ఎంపీడీవో**

**పోలీసుల గాలింపు**

**ఫెర్రీ లీజుదారు బకాయిలు చెల్లించనందునే అదృశ్యమైనట్టు వార్తలు!**

**రూ.55 లక్షల ఫెర్రీ బకాయిల అంశంతోనే పవన్ కు లేఖ రాసిన ఎంపీడీవో**



పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణారావు అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఆయన ఏలూరు కాలువలో దూకి ఉంటాడని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. జులై 10 నుంచి సెలవులో ఉన్న వెంకటరమణారావు మచిలీపట్నం వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయల్దేరారు. ఈ నెల 16న ఆయన పుట్టినరోజు కాగా... పుట్టినరోజే తన చివరి రోజు అంటూ ఎంపీడీవో తన కుటుంబ సభ్యులకు మెసేజ్ పెట్టడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎంపీడీవో అదృశ్యం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు. మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారు లక్షల్లో బకాయి ఉన్నందునే, ఒత్తిడి భరించలేక వెంకటరమణారావు అదృశ్యమైనట్టు తెలుస్తోంది. కాగా, ఎంపీడీవో వెంకటరమణారావు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు లేఖ రాశారు. కొందరు వ్యక్తులు రూ.55 లక్షల మేర ఫెర్రీ లీజు బకాయి పడ్డారని వెంకటరమణారావు ఆ లేఖలో పేర్కొన్నారు. గత చీఫ్ విప్ ప్రసాదరాజు అండతో వారు డబ్బులు చెల్లించలేదని ఆరోపించారు. గత మూడున్నర నెలలుగా వారు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చేయని తప్పుకు మానసిక క్షోభ అనుభవిస్తున్నానని తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బకాయిలు రికవరీ చేయనందున ప్రభుత్వం తనను బాధ్యుడ్ని చేసే అవకాశం ఉందంటూ వాపోయారు. ఎంపీడీవో ఉద్యోగమే తనకు జీవనాధారం అని, సదరు వ్యక్తులు బకాయిలు చెల్లించేలా చేసి తనకు న్యాయం చేయాలని వెంకటరమణారావు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు విజ్ఞప్తి చేశారు.

## రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నేతల సమావేశం**

**మూడు దఫాలుగా రైతు రుణమాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి**

**సాయంత్రం రూ.1 లక్ష, నెలాఖరు నాటికి రూ.1.5 లక్షల రుణమాఫీ**

**ఆగస్టులో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి**



రైతు రుణమాఫీకి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... మూడు దఫాలుగా రైతు రుణమాఫీ చేయనున్నట్లు చెప్పారు. రేపు సాయంత్రం 4 గంటలలోగా రూ.1 లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామన్నారు. రేపు సాయంత్రం లోగా నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తామన్నారు.

ఈ నెలాఖరులోగా రెండో దఫాలో లక్షన్నర రూపాయల వరకు ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. ఆగస్ట్ నెలలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. 7 నెలల్లోనే సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు చెప్పారు. ఏకమొత్తంలో వీటిని మాఫీ చేస్తామని పేర్కొన్నారు.

## యూపీ సీఎం, డిప్యూటీ సీఎం మధ్య విభేదాలపై స్పందించిన అఖిలేశ్ యాదవ్

**యోగి, కేశవ్ ప్రసాద్ మధ్య విభేదాలు ఉన్నట్లుగా ప్రచారం**

**బీజేపీ ప్రభుత్వం అస్థిరతతో సతమతమవుతోందన్న అఖిలేశ్**

**అంతర్గత కుమ్ములాటలతో కీచులాడుకుంటున్నారని విమర్శ**

**ఆధిపత్య పోరుతో అభివృద్ధి అటకెక్కిందని మండిపాటు**



ఉత్తర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య మధ్య విభేదాలు ఉన్నట్లుగా జరుగుతోన్న ప్రచారంపై మాజీ సీఎం, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందించారు.

రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం అస్థిరతతో సతమతమవుతోందన్నారు. బీజేపీ నేతలు అంతర్గత కుమ్ములాటలతో కీచులాడుకుంటున్నారని విమర్శించారు. కాషాయ నేతల మధ్య ఆధిపత్య పోరుతో అభివృద్ధి అటకెక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను వేధిస్తోందన్నారు. రాష్ట్ర రాజధాని లక్నోలో గృహాల కూల్చివేత నిర్ణయాన్ని వాయిదా వేశారని, యోగి ప్రభుత్వం బలహీనపడుతోందనడానికి ఇది సంకేతమన్నారు. మరోపక్క, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య విభేదాలు చర్చనీయాంశంగా మారాయి. డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య మంగళవారం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ సగం సీట్లు కూడా గెలుచుకోలేకపోయింది. దీంతో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య విభేదాలు వచ్చాయి.

## సమీపిస్తున్న ఐటీఆర్ ఫైలింగ్ గడువు.. ఆలస్యమైతే ఏం జరుగుతుంది?

### జులై 31, 2024 వరకు ఐటీఆర్ దాఖలుకు గడువు

### గడువు దాటితే జరిమానాతో ఈ ఏడాది చివరి వరకు అవకాశం

### ఆదాయాన్ని బట్టి జరిమానా విధించనున్న ఆదాయ పన్ను విభాగం




ఆర్థిక సంవత్సరం 2023-24కు (మదింపు ఏడాది 2024-25) సంబంధించిన ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)-2024 దాఖలుకు గడువు సమీపిస్తోంది. జులై 31 చివరి తేదీగా ఉంది. డెడ్‌లైన్‌లోగా ఐటీఆర్ ఫైలింగ్ చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే గడువు తేదీ తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే చెల్లింపుదారులు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. జరిమానా ఎంతనేది ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. జరిమానాతో డిసెంబర్ 31, 2024 వరకు ఐటీఆర్ దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుంది.

**జరిమానా ఎవరికి ఎంత ఉంటుంది?**

ఆర్థిక సంవత్సరం 2023-24కు (మదింపు ఏడాది2024-25) సంబంధించి నికర పన్ను విధించాల్సిన ఆదాయం రూ. 5 లక్షల కంటే ఎక్కువగా ఉంటే చెల్లింపుదారులు రూ.5000 జరిమానా విధించి ఐటీఆర్ దాఖలు చేయవచ్చు. నికర పన్ను విధించాల్సిన ఆదాయం రూ. 5 లక్షలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే మాత్రం ఆలస్య ఐటీఆర్‌పై చెల్లింపుదారులు రూ.1,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

కాగా పన్ను విధించదగిన ఆదాయం బేసిక్ మినహాయింపు పరిమితి కంటే తక్కువగా ఉన్న వ్యక్తులు, కేవలం రీఫండ్ క్లెయిమ్ కోసం ఐటీఆర్ దాఖలు చేసేవారు ఎలాంటి ఆలస్య జరిమానా చెల్లించాల్సిన అవసరం ఉండదని ఆదాయ పన్ను విభాగం నిబంధనలు చెబుతున్నాయి.

కాగా ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరి అని ఆదాయ పన్ను విభాగం నిబంధనలు చెబుతున్నాయి. లేదంటే చెల్లింపుదారులు జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాదు అవసరమైతే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే సకాలంలో బాధ్యతగా ఐటీఆర్ ఫైలింగ్ చేయడం మంచిదని పన్ను నిపుణులు సూచిస్తున్నారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో బీహార్ బూట్లు...

### గత రెండేళ్లుగా ఉక్రెయిన్ పై రష్యా సైనిక దాడులు

### బీహార్ బూట్లను వినియోగిస్తున్న రష్యా సైనికులు

### లైట్ వెయిట్ తో ప్రతికూల వాతావరణంలోనూ సౌకర్యవంతంగా బీహార్ బూట్లు

### హాజీపూర్ సంస్థకు రూ.100 కోట్ల ఆర్డర్ ఇచ్చిన రష్యా సైన్యం!



గత రెండేళ్లుగా రష్యా... ఉక్రెయిన్ పై దాడులు కొనసాగిస్తూనే ఉంది. కాగా, ఈ యుద్ధంలో రష్యా సైనికులు ఉపయోగిస్తున్న బూట్లు మనదేశంలోని బీహార్ రాష్ట్రంలో తయారవుతున్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. బీహార్ లో రాజధాని పాట్నా తర్వాత బాగా అభివృద్ధి చెందుతున్న నగరం హాజీపూర్. ఈ పట్టణం పాదరక్షల తయారీకి ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారయ్యే నాణ్యమైన పాదరక్షలకు అంతర్జాతీయంగా పేరుంది. అందుకే, రష్యా సైన్యం తమ సైనికుల కోసం హాజీపూర్ బూట్లనే వినియోగిస్తోంది. హాజీపూర్ లోని కాంపిటెన్స్ ఎక్స్ పోర్ట్స్ కంపెనీ... రష్యా సైనికులకు బూట్లు సరఫరా చేసేందుకు రూ.100 కోట్ల ఆర్డర్ పొందడం మామూలు విషయం కాదు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆర్మీల్లో రష్యా సైన్యం కూడా ఒకటి. రష్యన్ సైనికులు ఉపయోగించే ఆయుధాలు కానీ, సాంకేతిక పరికరాలు కానీ, వారి యూనిఫాం, ఇతర ఉపకరణాలు కానీ నాణ్యతా ప్రమాణాల పరంగా ఏమాత్రం రాజీపడరు. అందుకే, రష్యా ఆర్మీ బూట్ల తయారీకి పేరెన్నికగన్న హాజీపూర్ లో తమ సైనికులకు బూట్లు తయారు చేయిస్తోంది. బీహార్ బూట్లు ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకునేలా రూపొందిస్తారు. ఇవి తేలిగ్గా ఉండడమే కాదు, మైనస్ 40 డిగ్రీల అత్యంత శీతల వాతావరణంలోనూ సౌకర్యవంతంగా ఉంటాయి. గతేడాది కాంపిటెన్స్ ఎక్స్ పోర్ట్స్ కంపెనీ 15 లక్షల మిలిటరీ గ్రేడ్ బూట్లను రష్యాకు ఎగుమతి చేసింది. తమ బూట్లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా... కాంపిటెన్స్ కంపెనీ ప్రజల వినియోగం కోసం డిజైనర్ షూ తయారు చేసి యూరప్ మార్కెట్లో విడుదల చేయాలని భావిస్తోంది.

## జేసీ ప్రభాకర్ రెడ్డికి నచ్చకపోతే ఇలాగే ఉంటుంది...



రాయలసీమ రాజకీయనేతల్లో జేసీ ప్రభాకర్ రెడ్డి ఓ విలక్షణమైన నేత. ప్రస్తుతం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ గా ఉన్న ఆయన... గత ఐదేళ్లలో వైసీపీ నేతలతో తీవ్రస్థాయిలో పోరాటం జరిపారు. ప్రతి రోజు ఉదయం తన నివాసంలో సాధారణ ప్రజలను కలుసుకుని, వారి సమస్యలు తెలుసుకోవడం జేసీ ప్రభాకర్ రెడ్డి దినచర్యల్లో ఒకటి.

తాజాగా, శ్రీనివాసులు అనే మాజీ టీడీపీ నేత కూడా జేసీని కలవడానికి ఆయన ఇంటికి వచ్చాడు. శ్రీనివాసులు గతంలో టీడీపీని వీడి, పెద్దారెడ్డి పక్షంలో చేరి జేసీపైనే విమర్శలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అలాంటి వ్యక్తి తనను కలవడానికి రావడంతో జేసీ ప్రభాకర్ రెడ్డి ఏమాత్రం సహించలేకపోయారు. వెంటనే వెళ్లిపోవాల్సిందిగా శ్రీనివాసులుకు స్పష్టం చేశారు. శ్రీనివాసులు ఎంతకీ వెళ్లకపోవడంతో జేసీ అనుచరుల్లో ఇద్దరు శ్రీనివాసులును చేతులతో మోసుకుంటూ బయటికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అదరగొట్టిన భారత కుర్రాళ్లు

**నాలుగు స్థానాలు మెరుగుపడి 6వ ర్యాంకులో నిలిచిన యశస్వి జైస్వాల్**

**37 స్థానాలు మెరుగుపరచుకొని 36వ ర్యాంకు చేరుకున్న శుభ్‌మన్ గిల్**

**జింబాబ్వే టూర్‌లో రాణించడంతో మెరుగుపడిన ర్యాంకులు**

**బౌలర్ల కేటగిరిలో టాప్-10లో ఒక్కభారత బౌలర్ కూడా లేని వైనం**



ఇటీవల జింబాబ్వేతో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించిన యంగ్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మాన్ గిల్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టారు. ముఖ్యంగా డాషింగ్ ఓపెనర్ జైస్వాల్ నాలుగు స్థానాలు మెరుగుపరచుకొని 6వ ర్యాంకులో నిలిచాడు. జింబాబ్వేతో జరిగిన సిరీస్‌లో జైస్వాల్ మూడు మ్యాచ్‌లు ఆడి 70.50 సగటుతో మొత్తం 141 పరుగులు బాదాడు. 165.88 స్ట్రైక్ రేట్‌తో జింబాబ్వే బౌలర్లపై దాడి చేశాడు. ముఖ్యంగా 4వ టీ20 మ్యాచ్‌లో చెలరేగాడు. కేవలం 53 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో ఏకంగా 93 పరుగులు సాధించాడు.

మరోవైపు టూర్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన శుభమాన్ గిల్ కూడా ఏకంగా 36 స్థానాలు ఎగబాకి 37వ ర్యాంక్‌లో నిలిచాడు. సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లూ ఆడిన గిల్ మొత్తం 170 పరుగులు చేశాడు. అతడి సగటు 42.50 పరుగులుగా ఉంది. ఇందులో రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతడి స్ట్రైక్ రేట్ 125.92గా ఉంది. ఇక టాప్-2గా భారత డాషింగ్ బ్యాట్స్‌మెన్ సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. అయితే ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ ఒక స్థానం ఎగబాకి సూర్యతో సమానమైన పాయింట్లతో (797) మూడవ స్థానంలో నిలిచాడు. కాగా ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ మొత్తం 844 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. జులై 26 నుంచి శ్రీలంక వర్సెస్ భారత్ జట్ల మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. భారత ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా ర్యాంకులు మారే అవకాశం ఉంటుంది.

**టాప్-10లో భారత బౌలర్లకు దక్కని చోటు**

బౌలర్ల విషయానికి వస్తే, ఐసీసీ టీ20 బౌలర్ ర్యాంకుల్లో ఒక్క భారత బౌలర్‌కూ చోటు దక్కలేదు. కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ వీరు ముగ్గురూ జింబాబ్వే టూర్‌లో ఆడకపోవడంతో పాయింట్లను కోల్పోయారు. గతంలో నాలుగవ స్థానంలో నిలిచిన కుల్దీప్ ఇప్పుడు 15వ స్థానానికి దిగజారాడు. ఇక గత అప్‌డేట్‌లో 7, 5 స్థానాల్లో నిలిచిన పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఇప్పుడు వరుసగా 21, 23 స్థానాలకు పడిపోయారు. ఇక ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో గతంలో 9వ స్థానంలో నిలిచిన అక్షర్ పటేల్ ఇప్పుడు 15వ స్థానానికి పడిపోయాడు.

# పారిస్ ఒలింపిక్స్ లో పాల్గొనే భారత అథ్లెట్ల జాబితాకు కేంద్రం ఆమోదం

**జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు ఒలింపిక్స్**

**ఆతిథ్యమిస్తున్న పారిస్ మహానగరం**

**117 మంది అథ్లెట్లను ఒలింపిక్స్ కు పంపుతున్న భారత్**

అతి పెద్ద అంతర్జాతీయ క్రీడా సంరంభం ఒలింపిక్స్ మరి కొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ క్రీడా మహోత్సవానికి ఫ్రాన్స్ రాజధాని పారిస్ ఆతిథ్యమిస్తోంది. పారిస్ ఒలింపిక్స్-2024 జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరగనున్నాయి. కాగా, పారిస్ ఒలింపిక్స్ కు భారత్ భారీ బృందాన్ని పంపుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల్లో భారత్ తరఫున 117 మంది అథ్లెట్లు పోటీ పడనున్నారు. తాజాగా, ఒలింపిక్స్ లో పాల్గొనే భారత అథ్లెట్ల జాబితాకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఒలింపిక్స్ కు క్వాలిఫై అయిన మహిళా షాట్ పుటర్ అబా కథువా పేరును ఈ జాబితా నుంచి తొలగించారు. కేంద్రం ఆమోదించిన జాబితాలో ఆమె పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కాగా, భారత అథ్లెట్లతో పాటు 140 మందితో కూడిన సహాయక సిబ్బంది, అధికారుల బృందం కూడా పారిస్ వెళ్లనుంది. ఈసారి అందరి దృష్టి భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే ఉండనుంది. చోప్రా 2021 ఒలింపిక్స్ లో జావెలిన్ త్రో అంశంలో స్వర్ణం చేజిక్కించుకుని చరిత్ర సృష్టించడం తెలిసిందే. ఇటీవల కొంతకాలంగా ప్రపంచ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలోనూ భారత అథ్లెట్లు రాణిస్తుండడంతో... పారిస్ ఒలింపిక్స్ లో ఆయా



క్రీడాంశాల్లో పతకాలపై ఆశలు కలుగుతున్నాయి. ప్రధానంగా భారత్ రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, హాకీ, ఆర్చరీ క్రీడాంశాల్లో పతకాలను ఆశిస్తోంది.

# కోచింగ్ సిబ్బంది కోసం గంభీర్ సూచించిన ఐదుగురిలో నలుగురిని తిరస్కరించిన బీసీసీఐ!

భారత్ క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ పేరుని ప్రకటించి దాదాపు పది రోజులు కావొస్తోంది. అయితే సహాయక సిబ్బందిపై ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. బీసీసీఐ పెద్దలతో పాటు కోచ్ ద్రావిడ్ కోసం కోచింగ్ సిబ్బందిని అన్వేషించే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో కోచింగ్ సిబ్బందిలో వివిధ పాత్రల కోసం గంభీర్ సూచించిన ఐదుగురు మాజీలలో నలుగురిని బీసీసీఐ తిరస్కరించినట్టు కథనాలు వెలువడుతున్నాయి. ఆర్ వినయ్ కుమార్, మోర్నీ మోర్కెల్, అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోస్చాట్, జాంటీ రోడ్స్, లక్ష్మీపతి బాలాజీ పేర్లను సూచించగా.. ప్రస్తుతం కోల్‌కతా నైట్ రైడర్స్ అసిస్టెంట్ కోచ్‌గా పనిచేస్తున్న అభిషేక్ నాయర్‌కు మాత్రమే బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది.ఁఅధికారిక ప్రకటన వెలువడకపోయినప్పటికీ అభిషేక్ నాయర్ పట్ల బీసీసీఐ సుముఖంగా ఉన్నట్టు 'ఎకనామిక్ టైమ్స్' కథనం పేర్కొంది. అయితే మోర్నీ మోర్కెల్, వినయ్ కుమార్, బాలాజీ, జాంటీ రోడ్స్, ర్యాన్ టెన్ పట్ల బోర్డు ఆసక్తి చూపలేదని తెలిపింది. మాజీ కోచ్‌లు రవిశాస్త్రి, రాహుల్ ద్రావిడ్‌లు తమ కోచింగ్ స్టాఫ్‌ను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను బీసీసీఐ కల్పించిందని, అయితే గంభీర్ విషయంలో ఆ స్వేచ్ఛ ఇవ్వడం లేదని పేర్కొంది.

**బౌలింగ్ కోచ్‌గా జహీర్ ఖాన్!**

భారత జట్టు తదుపరి బౌలింగ్ కోచ్‌గా జహీర్ ఖాన్‌ను నియమించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. భారత్‌కు ఆడిన అత్యుత్తమ బౌలర్లలో జహీర్ ఖాన్ ఒకడని, అతడికి అవకాశం ఇవ్వాలని బీసీసీఐ పెద్దలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా జహీర్ భారత్ జట్టుకు అన్ని ఫార్మాట్లలో కలిపి 309 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి మొత్తం 610 వికెట్లు తీశాడు. లక్ష్మీపతి బాలాజీ పేరు కూడా బీసీసీఐ దృష్టికి వచ్చినప్పటికీ జహీర్ ఖాన్‌వైపే మొగ్గుచూపుతోందని సమాచారం.



# నికితా దత్తా యొక్క ఫ్యాషన్ మూమెంట్స్



# బెల్లంకొండ.. మరోసారి హై వోల్టేజ్ యాక్షన్ డోస్




బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నెక్స్ట్ సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో "టైసన్ నాయుడు" అనే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను చేస్తున్నారు. అతనికి ఇది పదవ సినిమా. ఈ చిత్రంలో సాయి శ్రీనివాస్ ఒక పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ నటించనున్నారు. మైక్ టైసన్ అభిమానిగా ఒక బాక్సింగ్ ప్రియుడిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన కొన్ని పోస్టర్లు మంచి క్రేజ్ అందుకున్నాయి. మరోసారి బెల్లంకొండ హీరో హై వోల్టేజ్ యాక్షన్ ను హైలెట్ చేయనున్నట్లు తెలుస్తోంది.

రీసెంట్ గా ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ షెడ్యూల్ రాజస్థాన్‌లో ప్రారంభమైంది. ఈ రెండు వారాల షెడ్యూల్‌లో టీమ్ ఒక అద్భుతమైన యాక్షన్ ఎపిసోడ్‌ను మరియు కొన్ని టాకీ భాగాలను షూట్ చేయనుంది. ఈ యాక్షన్ ఎపిసోడ్ చాలా ప్రత్యేకమైనదిగా ఉండబోతుందని తెలుస్తోంది, సినిమాలో ఒక కీలక సమయంలో వచ్చే ఆ ఫైట్ కు ఆడియెన్స్ షాక్ అవ్వడం పక్కా అని ఒక టాక్ వినిపిస్తోంది.

సాయి శ్రీనివాస్ ఈ యాక్షన్ సీన్స్‌లో కొన్ని ప్రమాదకరమైన స్టంట్స్ చేశారని తెలుస్తోంది. స్టంట్ శివా పర్యవేక్షణలో జరుగుతున్న ఈ యాక్షన్ ఎపిసోడ్ రాత్రి సమయంలో 10 రోజులు పాటు షూట్ చేస్తున్నారు. మిగతా రోజుల్లో సాయి శ్రీనివాస్ మరియు ఇతర ప్రధాన తారాగణం పాల్గొనే టాకీ భాగాలను షూట్ చేయనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన హీరోయిన్ మరియు ఇతర తారాగణం వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. ఇటీవల బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని రామ్ ఆచంట మరియు గోపీ ఆచంట 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు, ముకేష్ జ్ఞానేశ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలను చేపడుతున్నారు.

"టైసన్ నాయుడు" చిత్రానికి సంబంధించి ఇప్పటికే ఏర్పడిన అంచనాలు మరింతగా పెరిగాయి. మైక్ టైసన్ అభిమానిగా బాక్సింగ్‌ను ప్రేమించే ఒక పోలీస్ అధికారిగా సాయి శ్రీనివాస్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని అందరూ ఆశిస్తున్నారు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్లు అందుకుంటుందో చూడాలి. ఇక బెల్లంకొండ మరో రెండు సినిమాలను లైన్ లో పెట్టె ప్రయత్నం చేస్తున్నారు. అందులో రాక్షసుడు సీక్వెల్ కూడా ఉంది. త్వరలోనే ఈ ప్రాజెక్టులపై కూడా అప్డేట్స్ రానున్నాయి.

# ఇన్‌స్టాగ్రామ్‌లో అవికా గోర్ టైమ్‌లెస్ గాంభీర్యం



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com